# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 145 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

08-04-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4




- రాష్ట్ర అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితం అవుతోందని విమర్శ
- సీఎం వైఖరిలో స్పష్టమైన పక్షపాతం ఉందని ఆరోపణ
- నిపుణుల కమిటీ సిఫార్సులు బేఖాతరు
- అమరావతి నిర్ణయం ఏకపక్షంగా తీసుకున్నారని ధర్మాన వ్యాఖ్య
- ఉత్తరాంధ్ర, రాయలసీమలకు కొనసాగుతున్న అన్యాయం
- భారీ బడ్జెట్ ఉన్నా వెనుకబడిన ప్రాంతాలకు నిధుల కొరత
- అమరావతి నిర్మాణం పేరుతో లక్షల కోట్ల భారం
- 50 ఏళ్లు వేచి చూడాలా అని ప్రజల ప్రశ్న
- వంశధార ప్రాజెక్టుకు నామమాత్ర కేటాయింపులపై విమర్శ
- కేంద్రీకృత అభివృద్ధి వల్ల ప్రాంతీయ విభేదాల ప్రమాదం
- సీఎం నిర్ణయాలపై పునరాలోచన చేయాలని డిమాండ్
- రాష్ట్ర అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితం అవుతోందని విమర్శ

# ఒకే ప్రాంతం కోసం

# రాష్ట్రాన్ని తాకట్టు?

**రాజధాని పేరుతో రాష్ట్రంలో చిచ్చు**

**చంద్రబాబు వైఖరిపై ధర్మాన ఘాటు విమర్శలు**

(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందించాల్సిన బాధ్యత సీఎం పై ఉందని, కానీ సీఎం బాబు ఏకపక్ష వైఖరి, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. రాజధాని పేరుతో ప్రాంతీయ విద్వేషాలకు ఆజ్యం పోస్తూ, రాష్ట్రాన్ని మళ్లీ ప్రమాదకర దిశగా నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని అన్నారు.

## సమాన అభివృద్ధి ఎక్కడ?

అభివృద్ధి అన్నది అన్ని ప్రాంతాలకు సమానంగా అందినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్యమని ధర్మాన స్పష్టం చేశారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం కేవలం ఒక ప్రాంతానికి, కొద్దిమంది సంపన్నులకే మేలు చేసేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి తండ్రి లాంటి వారు కావాలని, అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు.

## కమిటీలను పక్కన పెట్టిన నిర్ణయాలు...

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ అమరావతి ప్రాంతం రాజధానికి అనుకూలం కాదని స్పష్టంగా చెప్పిందని, అయినా ఆ సిఫార్సులను బేఖాతరు చేస్తూ చంద్రబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. నిపుణుల అభిప్రాయాలను అవమానించి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాజకీయ అవసరాల కోసం చట్ట సవరణలు చేయించారని ఆరోపించారు.

## చరిత్ర పాఠాలు మరచిపోయారా?

గతంలో హైదరాబాద్‌కే అభివృద్ధి కేంద్రీకృతం కావడం వల్లే తెలంగాణ ఉద్యమం వచ్చిందని, అదే తప్పును మళ్లీ పునరావృతం చేస్తున్నారని ధర్మాన హెచ్చరించారు. ఒకే ప్రాంతంపై లక్షల కోట్లు ఖర్చు పెడితే భవిష్యత్తులో మళ్లీ ప్రాంతీయ విభేదాలు తలెత్తే ప్రమాదం ఉండదా అని ప్రశ్నించారు

ఉత్తరాంధ్ర, రాయలసీమకు అన్యాయం......

విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన ప్రాంతాలని పేర్కొన్నప్పటికీ, ఇప్పటికీ అక్కడ అభివృద్ధి కనిపించడంలేదని , 80 ఏళ్ల వయసులో కూడా ప్రజలు వలస వెళ్తుండడం దారుణమన్నారు. రూ.3.30 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో శ్రీకాకుళం ప్రాజెక్టులకు కనీసం రూ.1000 కోట్లు కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు.

## అమరావతి - భారీ భారం

అమరావతిలో మౌలిక వసతులకే రూ.2 లక్షల కోట్లు అవసరమని, పూర్తి స్థాయిలో నిర్మాణానికి 50 ఏళ్లు పడుతుందని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పారని గుర్తుచేశారు. అంతకాలం వెనుకబడిన ప్రాంతాల ప్రజలు అభివృద్ధి కోసం ఎదురుచూడాలా అని ప్రశ్నించారు.

## వికేంద్రీకరణే పరిష్కారం

ప్రపంచం మొత్తం వికేంద్రీకరణ దిశగా వెళ్తుంటే, రాష్ట్రంలో మాత్రం కేంద్రీకృత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదన్నారు. గతంలో ప్రతిపాదించిన వికేంద్రీకరణ విధానం తో అనేక జిల్లాలకు మేలు చేస్తుందని, దాన్ని అవహేళన చేయడం సరికాదన్నారు.

## వంశధార ప్రాజెక్టుపై విమర్శలు

వంశధార ప్రాజెక్టుపై మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న వ్యాఖ్యలు అసత్యమని ధర్మాన పేర్కొన్నారు. నాటి సీఎం వైయస్ జగన్ చిత్తశుద్ధితో ఒడిషా సీఎంతో చర్చలు జరిపారని గుర్తు చేశారు. ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు అవసరముండగా, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.80 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ట్రిబ్యునల్ తీర్పు తర్వాత కూడా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

## భవిష్యత్తుపై ఆందోళన

ఒకే ప్రాంతంపై అభివృద్ధి కేంద్రీకృతం చేస్తే భవిష్యత్తులో ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్లు మళ్లీ తెరపైకి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర సంపద ఐదు కోట్ల ప్రజలకు చెందాలని, కేవలం అమరావతికే పరిమితం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

## పునరాలోచన చేయాలి

ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే విధానాలను విడిచిపెట్టి, సమాన అభివృద్ధికి కట్టుబడి ఉండాలని సీఎం చంద్రబాబును ధర్మాన ప్రసాదరావు డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, తన నిర్ణయాలను పునరాలోచించుకోవాలని సూచించారు.

# నేడు 'ఆంధ్రజ్యోతి' ఎదుట వైసీపీ ధర్నా




నవతరం -శ్రీకాకుళం

ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ప్రతినిధి రాధాకృష్ణ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఎచ్చెర్ల లోని ఆ పత్రిక కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ -మిగతా 2లో

# అమరావతికి రాజముద్ర

- తెలుగుదేశం పార్టీ నాయకులు మాదారపు వెంకటేష్
- గెజిట్ నోటిఫికేషన్‌తో అమరావతి రాజధానికి చట్టబద్ధత
- ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష నెరవేర్పు
- సీఎం చంద్రబాబు నాయకత్వానికి ప్రశంసలు
- కూటమి విజయానికి ప్రజల మద్దతు - వైసీపీ వైఖరిపై తీవ్ర విమర్శలు

2లో



# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు




- ఆరోగ్యమే నిజమైన సంపద
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. అనిత

(నవతరం శ్రీకాకుళం)

ఆరోగ్యమే నిజమైన సంపదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత తెలిపారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విజ్ఞానానికి అండగా నిలుద్దాం - ఆరోగ్యం కోసం కలిసి పనిచేద్దాం అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి స్థానిక 7రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు -మిగతా 2లో

# అమరావతికి ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కేంద్రం



- మత్స్యరంగ అభివృద్ధికి కీలక ముందడుగు
- మత్స్యకారులకు సాంకేతిక, ఆర్థిక మద్దతు పెరుగుదల
- ఉపాధి, మార్కెటింగ్ అవకాశాలు విస్తరణ

2లో

ఎడిటోరియల్

# ఇంత అల్పత్వమా..!

కేరళ ఎన్నికల ప్రచారం ఈసారి ఒక అసాధారణ, విచిత్ర రాజకీయ ప్రదర్శనగా మారింది. విధానాలు, అభివృద్ధి నమూనాలు, ప్రజా సమస్యలపై సీరియస్ చర్చలు జరగాల్సిన వేదిక.. ఇప్పుడు "వింత సూత్రీకరణల సర్కస్"గా మారిపోవడం విస్తుగొలుపుతోంది. ఈ సర్కస్‌లో పుట్టిన తాజా సూత్రం "ఎల్డీఎఫ్‌బీజేపీ = రెండూ ఒకటే!" ఈ మహత్తర సూత్రావిష్కరణకు శిల్పులుగా నిలిచిన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి గార్లు, రాజకీయ తత్వశాస్త్రానికే కొత్త నిర్వచనం రాస్తున్నామన్న భ్రమల్లో ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నారు. మార్క్స్ నుంచి లెనిన్ వరకు, అంబేద్కర్ నుంచి మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వరకు.. మహామహులెవరికీ సాధ్యంకాని రీతిలో "విరుద్ధాలను సమానాలుగా" ప్రకటించే వీరి "వింత గణితం" నిజంగా ఆశ్చర్యమే! ఆశ్చర్యమే కాదు, వారి అల్పత్వానికీ నిదర్శనం. వీరి రాజకీయ గణిత సూత్రం ప్రకారం.. అగ్గి రాజేసినవాడూ, దాన్ని ఆర్పేవాడూ ఒకటేనట. ఇదే ఈ కొత్త రాజకీయ తర్కం! ఈ తర్కాన్ని ఇంకాస్త సూటిగా చెప్పాలంటే, "ఎల్డీఎఫ్‌కు ఓటేస్తే బీజేపికి వేసినట్టే" అన్న నినాదంగా మార్చేశారు. అంతటితో ఆగకుండా ఈ వింత గణితాన్ని వ్యక్తులకూ విస్త రించి "మోడీకి విజయన్‌కు తేడాలేదు" అనేదాకా చేరుకున్నారు. ఇదివింటే నవ్వొస్తుంది, కానీ విచిత్రంగా ఇదే ఇప్పుడు తీవ్రమైన రాజకీయ వాదనగా వినిపిస్తోంది. ఒకవైపు బీజేపీని మత రాజకీయాల కేంద్రంగా చూపిస్తూ, మరోవైపు ఆ రాజకీయాలకు వ్యతిరేకంగా నిరంతరం నిబద్ధతతో పోరాడుతున్న ఎల్డీఎఫ్‌ను కూడా అదే గాడిన కట్టడం అంటే, వాస్తవానికి అద్దం పట్టడం కాదు, అద్దాన్నే వంకరగా తిప్పడం. ఈ వంకర అద్దంలో చూస్తే నిజం కూడా అబద్ధంలా కనిపిస్తుంది. బహుశా అదే వీరి సరికొత్త రాజకీయ గణితశాస్త్ర పరమార్థం కాబోలు! రాహుల్‌గాంధీ గారైనా, రేవంత్‌రెడ్డి గారైనా చెప్పే ఈ "ఎల్డీఎఫ్ బీజేపీ" సమీకరణం, వాస్తవానికి వారి రాజకీయ బలహీనతను దాచుకునే ఒక దిగజారుడు వ్యూహం మాత్రమే. ఎందుకంటే కేరళలో ఎల్డీఎఫ్ (ావబ్ ఱవఎశీఛతీఅఱ ఖీతీశిత) నిర్మించిన అభివృద్ధి నమూనాను.. విద్య, వైద్యం, సామాజిక భద్రత, స్థానిక ఆర్థిక వ్యవస్థలలో సాధించిన ప్రగతిని చర్చించడానికి వారు సిద్ధంగా లేరు, చర్చించి గెలవలేరు కూడా. అందుకే ఈ విధమైన వక్రీకరణలకు పాల్పడుతున్నారు. ఈ సూత్రీకరణను నిజంగానే అంగీకరిస్తే, దాని తుదిఫలితం ప్రమాదకరంగా ఉంటుంది. మతతత్వాన్ని ప్రోత్సహించే శక్తి, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడే శక్తి, ఈ రెండూ ఒకటే అయితే, ఇక రాజకీయ విధానాలకే అర్థం ఉండదు. పోరాటాలకు విలువ ఉండదు. సిద్ధాంతాలకు ప్రాముఖ్యత ఉండదు. అందువల్ల ఇది కేవలం ఒక తప్పుడు పోలిక మాత్రమే కాదు, ఒక చారిత్రక సత్యాన్ని అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ 'మహా మేధావుల' వైఫల్యం. లేదంటే ఆ సత్యాన్నే చెరిపేయాలనే ప్రమాదకర ప్రయత్నం. అంతిమంగా ఇది ఎవరికి లాభం? నిస్సందేహంగా బీజేపీకే లాభం. ఎందుకంటే, ప్రత్యామ్నాయాన్ని మసక బారిస్తే ప్రజలముందు ఎంపికలే మాయమవుతాయి. కానీ, ప్రజాస్వామ్యంలో ఈ తప్పుడు వాదనలు ఎప్పటికీ నిలబడవు. ఎందుకంటే.. రెండు పరస్పర వ్యతిరేక ధ్రువాలను ఒకటిగా చూపడం తర్కం కాదు, మోసం. ఎల్డీఎఫ్, బీజేపీల మధ్య ఉన్న వ్యత్యాసం సాధారణ విధాన భేదం కాదు, అది సిద్ధాంతపరమైన విరోధం. వర్గ పోరాటం, లౌకికత్వం, సమానత్వం, సామాజిక న్యాయం ఎల్డీఎఫ్ విధానాలకు ఆధారం. మతాధారిత జాతీయత, సాంస్కృతిక ఆధిపత్యం, విభజన రాజకీయాలు, కార్పొరేట్ అనుకూల విధానం బీజేపీది. ఆరెస్సెస్ హిందూత్వ భావజాలానికి రాజకీయ ప్రతినిధి బీజేపీ. దానికి ప్రత్యామ్నాయమైన సామ్యవాద భావజాలానికి ప్రతినిధి ఎల్డీఎఫ్. ఇవి రెండు విధానాలు మాత్రమే కావు-రెండు విరుద్ధ దిశలు. రెండూ ఒకటేనని చెప్పడమంటే.. విషాన్నీ ఔషధాన్ని సమానమని చెప్పడమే. ఈ మాత్రం సోయిలేని నేతలు దేశానికి ప్రత్యామ్నాయం నిర్మిస్తారట! కేరళం ప్రజలు ఇది తెలుసుకోలేనంత అమాయకులను కోవడం కాంగ్రెస్ నేతల అవివేకం. అందుకే వారి రాజకీయ చైతన్యాన్ని అవమానించే దుస్సాహసానికి పూనుకుంటున్నారు. కేరళంలో లెఫ్ట్ విధానం ఇప్పటిది కాదు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ కాలం నుండీ ఒక ప్రత్యామ్నాయ విధానంతో నిర్మించిన ప్రజా నమూనా అక్కడ అమలవుతోంది. విజయన్ దాన్ని అద్భుతంగా కొనసాగిస్తున్నారు. ఎల్డీఎఫ్ పాలనలో కేరళ సమాజం ఒక స్పష్టమైన అభివృద్ధిని చూసింది. ప్రభుత్వవిద్యలో నాణ్యత, వైద్యంపై నమ్మకం, సామాజిక భద్రత ద్వారా భరోసా, స్థానిక ఉపాధి అవకాశాల్లో స్థిరత్వం, సామరస్యం-సమతాభావం, నిజాయితీ నిబద్ధతతో కూడిన పాలన.. ఇవన్నీ కేవలం విధానాలుగా కాదు, ప్రజల జీవితాల్లో అనుభవాలుగా నిలిచాయి. ఆ అనుభవాన్ని తప్పుడు సూత్రాలతో చెరిపేయ లేరు. జీవితం నేర్పిన సత్యాన్ని వీరి అబద్ధాల రాజకీయ గణితం మార్చలేదు. "విరుద్ధాలు ఎప్పటికీ సమానాలు కావు" అనే సార్వత్రిక సత్యం కేరళం ప్రజలకు బాగా తెలుసు. అయినా రాహుల్, రేవంత్ లాంటి మరుగుజ్జులు తిమ్మిని బమ్మిగా మార్చి ప్రచారం చేద్దామనుకుంటే చెల్లదు. కాంగ్రెస్ లా ఎన్నికల కోసం వామపక్షాలు తమ విధానాలు మార్చుకోవు. అసత్యాలూ అర్ధసత్యాలు వల్లించవు. గెలిచినా, ఓడినా విధానమే వెన్నెముకగా సత్యం కోసం నిలబడే బలం కమ్యూనిస్టులది.

# అమరావతికి రాజముద్ర

(నవతరం శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం చరిత్రాత్మక ఘట్టమని తెలుగుదేశం పార్టీ నాయకులు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో ప్రెస్ నోట్ విడుదల చేశారు. 2024 జూన్ 2 నుండి అమరావతి రాష్ట్ర రాజధానిగా అధికారిక హోదా పొందిందని, గెజిట్ నోటిఫికేషన్ ద్వారా చట్టబద్ధత లభించడంతో ఐదు కోట్ల ఆంధ్రుల దీర్ఘకాల ఆకాంక్ష నెరవేరిందని తెలిపారు.
అమరావతి సాధనలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని, తెలుగుజాతి గుండెల్లో ఆయన పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని కొనియాడారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు ఇచ్చిన అఖండ మద్దతుతో ఈ లక్ష్యం సాధ్యమైందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేసిన వైసీపీపై తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్ర ప్రజలు భవిష్యత్తులో తగిన తీర్పు ఇస్తారని తెలిపారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వారిని ప్రజలు అంగీకరించరని అన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర ప్రభుత్వానికి మరియు బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి చట్టబద్ధతలో వారి పాత్ర కీలకమని చెప్పారు. అమరావతి నిర్మాణంలో రైతులు, మహిళలు, ప్రజలు చేసిన త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయని, వారి పోరాటం వల్లే ఈ ఘట్టం సాధ్యమైందని అన్నారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుకు సాగుతోందని, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నందమూరి బాలకృష్ణ, నారా లోకేష్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, గొండుశంకర్ తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చివరగా, "ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతి జయహో" అని మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు.

# అమరావతికి ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కేంద్రం

నవతరం -అమరావతి

అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (చీఖీణదీ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు చేసిన ప్రతిపాదనకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.
ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా ఉండటంతో ప్రాంతీయ కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేయడానికి కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందన్నారు. అవసరమైన భూమి, మౌలిక వసతులు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సి ఉంటుందని వెల్లడించారు.
ఈ కేంద్రం ద్వారా మత్స్యకారులకు ఆధునిక సాంకేతికత, శిక్షణ, నాణ్యమైన విత్తనాలు, వ్యాధి నియంత్రణ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అలాగే సబ్సిడీలు, ఆర్థిక సహాయం త్వరితగతిన అందేలా సహకారం లభిస్తుందని పేర్కొన్నారు.
ప్రాసెసింగ్, నిల్వ, రవాణా, ఎగుమతుల రంగాల్లో మద్దతుతో మత్స్య ఉత్పత్తుల నాణ్యత పెరిగి, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు విస్తరించనున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# నేడు 'ఆంధ్రజ్యోతి' ఎదుట వైసీపీ ధర్నా

మొదటిపేజీ తరువాయి

ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, నాయకుల కుటుంబ సభ్యులపై నీచమైన భాషతో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ నేతల భార్యలను, కుటుంబ సభ్యులను కించపరిచేలా మాట్లాడటం రాధాకృష్ణ నీచ బుద్ధికి నిదర్శనమని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. 'కొత్త పలుకు' పేరుతో చేస్తున్న వ్యక్తిత్వ హననాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. దీనికి నిరసనగా రేపు (ఏప్రిల్ 8న) జిల్లా కేంద్రంలో నిరసనలు తెలుపుతామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తలు, అనుబంధ విభాగాల నేతలు అందరూ మధ్యాహ్నం మూడు గంటలకు ఎచ్చెర్ల లోని ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుటకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

మొదటిపేజీ తరువాయి

ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకొంటే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని, ఆ ఆరోగ్యమే నిజమైన సంపదన్నారు. ప్రతీ ఒక్కరూ క్రమంతప్పకుండా వ్యాయమం చేయాలని, పౌష్టికాహారం తీసుకొని వ్యక్తిగత, పరిశరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యకర జీవన విధానం అలవరుచుకొనుట వలన ఆనందకరమైన జీవనం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓ డా. రామ్ దాస్, డిప్యూటీ డి.ఎమ్.హెచ్.ఓ డా. మేరీ కేథరిన్, ఆర్.బి.ఎస్.కె. ప్రోగ్రామ్ అధికారి డా. శివరంజిని, డిప్యూటీ డెమో కె. యర్రన్న, డిప్యూటీ హెచ్.ఇ.ఓ ఎస్.విజయలక్ష్మి, పి. మోహిని రత్నకుమారి, కార్యాలయ సిబ్బంది, ఎ.ఎన్.ఎమ్, ఆశా వర్కర్లు, కార్యాలయ సిబ్బంది, రెడ్ క్రాస్ సభ్యులు, చైతన్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్‌పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

- ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం
- హెల్మెట్ తప్పనిసరి, ఉల్లంఘనకు జరిమానాలు




(నవతరం శ్రీకాకుళం)

జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పోలాకి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈదులవలస జంక్షన్ వద్ద ఎస్సై రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చునేవారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడగల కీలక భద్రతా సాధనమని వివరించారు. అదేవిధంగా వాహనదారులతో హెల్మెట్ వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

# ఆర్జీయూకేటీలో ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు



- నాలుగో రోజుకు చేరిన కార్యక్రమాలు
- విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందించే వేడుకలు

నవతరం -ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం ప్రాంగణంలో వీడ్కోలు వేడుకలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. కంప్యూటర్ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంచాలకులు ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు వినోదం కూడా అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఆర్థిక అధికారి వాసు, సంక్షేమ విభాగం డీన్లు సింహాచలం, యోగేశ్వరి, విభాగపతి శాస్త్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# 15 లోగా 'విద్యాంజలి'లో అప్లోడ్ చేయాలి

(నవతరం శ్రీకాకుళం)

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రధానోపాధ్యాయులు గుర్తించి విద్యాంజలి ( Portal: https://vidyanjali.education.gov.in/) పోర్టల్లో ఈ నెల 15వ తేదీలోగా అప్లోడ్ చేయాలని డీఈఓ ఎ. రవిబాబు, మరియు సమగ్రశిక్ష ఏపీసీ పి. వేణుగోపాలరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాంజలి పథకం ద్వారా ఎన్.ఆర్.ఎ.లు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పాఠశాలలను అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లుగా తెలిపారు.
దాతలు నేరుగా ఈ పోర్టల్ ద్వారా పాఠశాలలను ఎంచుకుని స్వచ్ఛంద సహకారం అందించవచ్చన్నారు. పోర్టల్ ద్వారా నగదు రూపంలో విరాళాలు సేకరించరని, కేవలం వస్తువులు, సేవల రూపంలో మాత్రమే సహకారాన్ని కోరుతున్నట్లుగా వారు తెలిపారు.
పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించాలనుకునే వారు పోర్టల్ ను సందర్శించి వలంటీరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.
విద్యాంజలి పథకం ద్వారా గదుల నిర్మాణం, మరమ్మతులు, ఫర్నీచర్, విద్యాసామగ్రి, తదితరాలు అందించేందుకు దాతలు ముందుకురావాలని ఈ ప్రకటన ద్వారా వారు కోరారు.

# నెగిటివిటీని ఎలా తట్టుకోవాలి..?

మన జీవితం అంతా ముళ్ల బాట కాదు, అలాగనీ వడ్డించిన విస్తరి కూడా కాదు.సుఖ,దుఃఖాల కలయికే జీవితం. కొన్ని సార్లు మనం ఎంత కష్టపడ్డా తగిన గర్తింపు రాదు. పైగా విమర్శలు కూడా వస్తుంటాయి. విమర్శలని కొందరు తేలిగ్గా తీసుకుంటారు. చాలా మంది తట్టుకోలేరు.

విమర్శలు చేసే వారు రెండు రకాల వారు ఉంటారు. ఒకరు సద్విమర్శలు చేసేవారు. వీరు సాధారణంగా బహిరంగంగా ఎవరినీ విమర్శించరు. ఒక వేళ ఏదైనా చెప్పాలనుకున్నా, వ్యక్తిగతంగా చెప్తారు.వీరు ఉపయోగించే భాష కూడా మర్యాదగా ఉంటుంది. ఇటువంటి వారికి నాయకత్వ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. వీరు చెప్పే విషయాల్లో ఎక్కువ వాస్తవాలు ఉంటాయి.ఇటువంటి వారు కూడా మనకు ఇద్దరు ముగ్గురు స్నేహితులుగా ఉంటే బావుంటుంది.

ఇంకో రకం వారు ఉంటారు. వీరు ఎల్లప్పుడూ కువిమర్శలు చేస్తారు. ఇటువంటి వారు దేన్నీ తొందరగా అంగీకరించరు. తాము నమ్మిందే నిజం అనుకుంటారు. వీరు ఉపయోగించే భాష కూడా అంత మృదువుగా ఉండదు. ఇటువంటి స్వభావం ఉన్న వారు ఎవరినైనా విమర్శిస్తారు. వీరు చెప్పే విషయాల్లో పెద్దగా నిజాలు ఉండవు. ఇందులోనే ఇంకో రకం వారు ఉంటారు. వీరు వారి ఈగో ని సంతృప్తి పరచు కోవడానికి సరదాగా విమర్శలు చేస్తుంటారు.వీరి గురించి పెద్దగా పట్టించు కోనవసరం లేదు. ఇందులో ఎక్కువగా పని లేని వాళ్ళు ఉంటారు.

సాధారణంగా ప్రజా జీవితంలో ఉన్న వారు ఎక్కువ విమర్శలు ఎదుర్కొంటారు.ఎందుకంటే వారి పరిధి ఎక్కువగా ఉంటుంది. రాజకీయ నాయకులు, క్రీడాకారులు, సినిమా తారలు ఎక్కువగా విమర్శలు ఎదుర్కొంటారు.

ప్రశంసలు, విమర్శలు జీవితంలో భాగమే. విమర్శలు చేసే వారు ఎదుటి వారు ఎలా ఉండాలో వారే నిర్ణయిస్తారు. కొన్ని విమర్శలు కూడా మనకు ఉపయోగ పడతాయి. అయితే కువిమర్శలను మనం భరించనవసరం లేదు. ఇందులో పుకార్లు ఎక్కువగా ఉంటాయి.

## ఏం చేయాలి?

పదే పదే విమర్శలు చేసే వారికి కచ్చితంగా మానసిక లోపం వున్నట్లే. వారు ఎక్కడో ఓ చోట దెబ్బ తింటారు. సోషల్ మీడియాలో ఇటువంటివి ఎక్కువగా చూస్తుంటాం.

అతి మంచి తనం, మొహమాటం కూడా మంచిది కాదు. కాబట్టి దీనికంటూ ఓ పరిధి పెట్టుకోవాలి. కొందరు మన సహాయం పొంది కూడా విమర్శలు చేస్తుంటారు. ఇటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. మనకంటూ ఓ టైమ్ టేబుల్ ఉంటుంది. దాని ప్రకారం మనం వెళ్ళాలి.మనం ప్రతి దానికి సంజాయిషీ చెప్పుకోవనవసరం లేదు.

జీవితంలో ఎవరూ శాశ్వతం కాదు. అలాగని ఎవరూ ఒంటరిగా జీవించలేరు. తెగిన బంధాల గురించి పెద్దగా అలోచించనవసరం లేదు. కొత్త స్నేహితులు వస్తూనే ఉంటారు.అలాగనీ బలమైన కారణం లేకుండా పాత స్నేహితులు వదులు కోకూడదు. ఏదైనా గ్యాప్ వస్తే చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చు.

మార్పు సహజం. ఫలానా ప్రాంతం వారే మంచి వారు, ఫలానా వారు చెడ్డ వారు అని ఎక్కడా ఉండదు. సమాజం అనేది మంచి చెడుల కలయిక.


స్నేహంగా ఉన్నంత మాత్రాన మన వ్యక్తిగత విషయాలు అన్నీ తోటి వారికి చెప్పనవసరం లేదు. గోప్యత మన ప్రాథమిక హక్కు.

## చివరిగా చెప్పేది ఏమిటంటే

టన్నుల కొద్దీ పరుగులు చేసిన సచిన్ టెండూల్కర్ సైతం కొన్ని సార్లు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ఓ పరిధి ఉంటుంది.ఒకరి జీవితం ఇంకొకరికి రాదు.జీవితంలో అందరినీ మెప్పించలేము. అ అవసరం కూడా లేదు. ఒక్కోసారి మన ఇంట్లో వారే మనల్ని విమర్శిస్తారు. ఎవరో ఒకరు విమర్శలు చేస్తే, అదే మన వ్యక్తిత్వం కాదు.కొందరు అసూయతో కూడా విమర్శలు చేస్తారు.

నిరంతర ప్రయత్నం, కొత్త అభిరుచులపై దృష్టి పెట్టడం, అతి మంచితనం తగ్గించుకోవడం, మనల్ని ఇబ్బంది పెట్టేవారిని ఏదో విధంగా వదిలించుకోవడం వంటి వాటి ద్వారా మనం ముందుకు సాగ వచ్చు.

కొసమెరుపు -ఈ వ్యాసం పోస్ట్ చేసిన తర్వాత నా మీద కూడా కొన్ని విమర్శలు వస్తాయి. అది మానవ నైజం.



యం.రాం ప్రదీప్

# అంటరానితనం... “మంటల్లో మహాజ్ఞాని”..!



రాక్షస మూకలైన
రోమా సైనికుల చెరలో
చిక్కి కల్వరి గిరిపై ఏసు క్రీస్తు
ఆనాడు అనుభవించె సిలువ
శిక్ష...
అంతకన్నా ఘోరం ఈ
కులవివక్ష...!

అంటరానితనంతో
అడుగడుగునా
అవమానాల అగాధాల్లో మునిగి
అసమానతల అగ్నిజ్వాలల్లో
కాలుతూ..!

సముద్రంత బాధను గుండెల్లో
మోస్తూ...
పిడుగులవంటి కష్టాలను
తట్టుకొని...
ఒకవైపు మాటిమాటికి
చాటుమాటుగా
కులసర్పం కాటు వేస్తున్నా...!

మరోవైపు కసితో...కక్షలతో
కాలసర్పాల్లా విషం చిమ్మే
అగ్రకుల
రాజకీయనాయకుల కుట్రలతో
కుతంత్రాలతో కుయుక్తులతో...
అమృతం పంచే పోరాటంలో
స్వజాతి వంచనలకు గురైనా...!

సమస్యల సుడిగుండాల్లో చిక్కి
దుఃఖాన్ని దిగమింగుతూ...
దిక్కుతోచని స్థితిలో
ఉక్కిరిబిక్కిరౌతూ...!

ఒక్కడే ఒక సైన్యంలా
ఒంటరిగా పోరాడి పోరాడి...
ఓటమిని ఒడిసిపట్టినవాడు...
గెలుపు గుర్రాలను
అధిరోహించినవాడు...!

అస్పృశ్యతనే శాపంతో
గుడికి... బడికి...నీటి చుక్కకు
తన జాతినిదూరం చేసినా...
ఆస్తి...ఆయుధం...
అన్నిటినుంచి వెలివేసినా...!

కులరక్కసి ఉక్కు పిడికిలిలో
చిక్కి ఉక్కిరిబిక్కిరయ్యే
తన దళిత జాతిని
రక్షించాలనే సంకల్పంతో
విహంగంలా విదేశాలకు
ఎగిరి...!

విజ్ఞానాన్ని సేకరించి...
రాజ్యాంగాన్ని రచించి...
పోయిన బహుజనుల హక్కుల్ని
తిరిగి సాధించిన
మహామేధావి...!
తన జ్ఞాన ఖడ్గంతో
ముళ్ళ కంచెలను చెరిపి...
అదృశ్యపు సంకెళ్ళను తెంచి...
చివరిశ్వాస వరకు అన్యాయంపై
ఆరని
అగ్నిజ్వాలై...విరుచుకుపడి...!

అణగారిన వ్యక్తిలోని
అనంతశక్తిని వెలికితీసి...
నల్లత్రాచులా బుసలుకొట్టే
ధైర్యంతో
గాలికొట్టిన బంతిలా మళ్ళీ
పైకెగసిన
అంబేద్కర్ ఆత్మవిశ్వాసం...
అనంతం..!

అట్టడుగున నెట్టినా...
పాతాళంలో పడదోచినా...
నిప్పురవ్వలా...
తారాజువ్వలా...
రామబాణంలా...
దూసుకొచ్చిన
విప్లవ కెరటం...
అగ్ని శిఖరం...
అమరజీవి డాక్టర్ బి.ఆర్.
అంబేద్కర్..!
ఎన్ని అక్రమాలు...
ఎన్ని అన్యాయాలు...
ఎన్ని అవమానాలు...
ఎన్ని అవహేళనలు...
ఎన్ని అడ్డంకులు...
ఎన్ని అవరోధాలు... అన్నీ
చిత్రహింసల తుపాన్లై
చుట్టుముట్టినా..!

బండరాళ్లతో
కొట్టినా...
మళ్లీ మళ్లీ పైకెగసిన
ఫీనిక్స్ పక్షి...
ముళ్ళబాటలను
పూలతోటలుగా...
విసిరిన రాళ్లను
విజయానికి మెట్లుగా
మార్చుకున్న మహా
విప్లవ వీరుడు...!

పోరాట యోధుడు...
ధీరుడు...
మగధీరుడు...
ఘనుడు...
త్యాగధనుడు
జ్ఞాన
సూర్యుడు...ప్రజ్ఞా శిఖరం...
అణగారిన వర్గాల...
ఆశాకిరణం...
అమరజీవి డాక్టర్ బి.ఆర్.
అంబేద్కర్..!

జయహో... జయహో...
ఓ అంబేద్కర్
మహాత్మా...జయహో జై
భీమ్...జై భీమ్.

(అంబేద్కర్ జయంతి
సందర్భంగా
(అంబేద్కర్‌కిదే నా అక్షర
హారతి...)



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ఆరోగ్య ప్రధాయిని...... ఇంటింటా తులసి చెట్టు



భారత దేశంలో, ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో హిందువులల్లో సామాన్యంగా ఏ ఇంటికి వెళ్లినా ముందుగా తులసి మొక్క దర్శనమిస్తుంది. తులసి మొక్కను దైవ సంబంధ మైనదిగా భావించి ఇంటిలోనే ఒక వైపు, ప్రత్యేకంగా ప్రతిరోజు నీరు పోసి, పసుపు, కుంకుమను పూసి పవిత్రంగా పెంచుకోవడం భక్తి పరాయణులైన మహిల దైనందిన కార్యక్రమంగా కనిపిస్తుంది. ఈ తులసి మొక్క కేవలం భక్తికే కాకుండా మానవాళిగా ఆరోగ్యరీత్యా కూడా ఎంతగానో ఉపయోగపడుతుందన్న విషయం చాలా మందికి తెలియదు. వైద్యశాస్త్రంలో ఈ మొక్కకు విశిష్ఠ స్థానం ఉంది. చాలా మంది తమ ఇళ్లలో వీటికి కోటలు కూడా నిర్మించి పూజలు చేస్తుంటారు.

వివిధ దేవాలయాలలో స్వీకరించే తీర్థాలలో కూడా తులసీ దళాలను వేస్తుంటారు. భారతీయ ఆచార, వ్యవహారాలలో ఇంతటి ప్రాముఖ్యత కలిగిన తులసి మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. తులసి ఆకులనుగానీ, రసాన్నిగానీ సేవిస్తే రోగనిరోధకశక్తి కూడా పెంపొందుతుందని, జ్వరంతో బాధపడే వారికి నీటిలో తులసి రసం వేసి ఇస్తే జ్వరం తీవ్రత తగ్గుతుందని ఆయుర్వేద వైద్యులు, ఆయుర్వేద శాస్త్రం తెలుపుతుంది.

శరీరంలో చక్కెర స్థాయిని అదుపు చేసే శక్తి కూడా తులసి రసానికి ఉంది. కాబట్టి మధుమేహంతో బాధపడేవారు రోజుకు రెండు పూటలా తులసి రసాన్ని నీటిలో కలిపి సేవించాలి. అలాగే ఉదరకోశ సంబంధమైన అల్సర్ కూడా నయం చేసే గుణం తులసికి ఉంది. గుండెజబ్బులు, హైపర్ టెన్షన్, వివిధ రకాల నొప్పులకు కూడా తులసి ఉపశమింప జేస్తుంది. అలాగే జలుబు, దగ్గు, పడిశం లాంటి వ్యాధులతో బాధపడేవారు. తులసి ఆకులను నమిలి నీరు తాగితే త్వరగా ఉపశమనం కలుగుతుంది. ఉబ్బసం, బ్రాంకైటిస్తో బాధపడేవారు తులసీరసం చేర్చిన టానిక్ లు ఎంతోమేలుచేస్తాయని వైద్యులు సూచిస్తున్నారు. అజీర్తివల్ల కలిగే ఆయసం, నొప్పులను కూడా దూరం చేస్తుంది. పూర్వం ఆయుర్వేద ప్రముఖులు క్షయవ్యాధి నివారణలో తులసిని వాడినట్లు తెలుస్తోంది. అంతేగాక, ఇతర మందులలో ఈ రసాన్ని వాడి మొండి వ్యాధుల్నికూడా నయం చేయగలిగారని చెప్పడానికి ఆధారాలు ఉన్నట్లు ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

తులసి ఆకులనుకాల్చడంవల్ల దోమలు కూడా దూరంగా పోతా యని వైద్యులు చెబుతున్నారు. దోమల వల్ల వ్యాప్తి చెందే మలేరియాను నివారిం చడంలో కూడా తులసి అమోఘంగా పని చేస్తుంది. ఏ రోగమూ లేని ఆరోగ్యవంతులుసైతం తులసి రసాన్ని రోజూ సేవించ వచ్చు. అంతే కాక తేనెలో కానీ, టీ. పాలు, పండ్ల రసాలలో గానీ కలుపుకొని తాగవచ్చని ఆయుర్వేద వైద్యులుచెప్తారు. దాదాపు 10,12 తులసి దళాలను వేసుకుని తయారుచేసిన ఈ నీటిని రోజూ ఉదయం పరగడుపున సేవిస్తే ఆ రోజంతా ఉత్సాహంగా, హుషారుగా ఉంటుంది. అంతే గాక, శరీరంపై మచ్చలు బయల్దేరి నప్పుడు తులసి ఆకులను నూరిరాస్తే ప్రయోజనం ఉంటుందని అంతేగాక తులసి రసాన్ని మసాజ్ చేయాలని కూడా వైద్యులు సూచిస్తున్నారు తులసిలో సి విటమిన్ కూడా పుష్కలంగా ఉంటుంది. రక్తాభివృద్ధికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.ఇలా తులసిలో ఫాస్ఫరస్,కాల్షియం, కెరోటిన్ లాంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయని,అంతేకాక బ్యాక్టీరియా,వైరస్లను నాశనం చేసే గుణం కూడా తులసీలో ఉంది. ఆరోగ్యాన్ని అందించే తులసి ఔషధం మొక్కను ప్రతి ఇంట్లో పెంచుకుందాం.!!

## ఒక మంచి మాట భక్తిని మించిందిలేదు

నిర్మలమైన భక్తికి భగవంతుడు లొంగిపోతాడు. కాని కలియుగంలో నిర్మలభక్తి కరువవుతున్నది.ఏదో ఒక ప్రతిఫలం ఆశించి భగవంతుని పూజించడం పెరిగింది.ఇటువంటి పరిస్థితి కలియుగంలో వస్తుందని ముందుగానే పసికట్టిన మన పూర్వీకులు భగవత్ తత్వాన్ని పురాణాల ద్వారా మనముందుంచారు. భగవంతునిపట్ల భక్తి ఎలా ప్రద ర్శించాలో గుహుడు, ప్రహ్లాదుడు, గజేం ద్రుడు, కుచేలుడి ద్వారా చూపించారు. ప్రతిఫలం ఆశించనివారి అచంచలభక్తికి భగవంతుడు స్పందించి ఆదుకున్న తీరు ప్రతిఒక్కరూ గుర్తుచేసుకోవాలి. ఆపదలోవున్న గజేంద్రుని రక్షించేం దుకు సిరికిం చెప్పక బయలుదేరిన మహావిష్ణువుని మించిన భక్తవల్లభుడు మరెవరుంటారు.



“ కావ్యసుధ “
‘వాఙ్మయ భూషణ’
“ సాహితీ శిరోమణి “
“ కవన సాగర “
‘ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్’
“ ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ “
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# కొత్త తరహా నాయకులు




(అంటే బయటకు ఆకర్షణీయంగా కనిపిస్తారు... కానీ లోపల వాస్తవం వేరేలా ఉంటుంది. ప్రజలు సులభంగా అర్థం చేసుకునేలా ఇలా చెప్పొచ్చు.)

1. మాటల్లో మాస్టర్స్
బాగా మాట్లాడతారు
పెద్ద పెద్ద వాగ్దానాలు చేస్తారు
కానీ... పనిలో మాత్రం ఫలితం తక్కువ
2. భావోద్వేగాలతో ఆట
కోపం, భయం, గర్వం లాంటి భావాలను ఉపయోగిస్తారు
నిజం కంటే ఫీలింగ్‌నే ఎక్కువగా చూపిస్తారు
3. అబద్ధాన్ని ఆకర్షణీయంగాలి చెబుతారు
నిజం కంటే అబద్ధాన్ని స్టైలిష్‌గా చెప్పగలరు
వినేవారికి అది నిజమే అనిపిస్తుంది
4. చిన్న లాభాలతో పెద్ద మోసం
తాత్కాలిక ప్రయోజనాలు ఇస్తారు (డబ్బు, గిఫ్ట్స్)
కానీ దేశానికి దీర్ఘకాల లాభం ఉండదు
5. ప్రశ్నలు అడిగేవాళ్ళను ఇష్టపడరు
విమర్శలను అడ్డుకుంటారు
ప్రశ్నిస్తే తప్పుగా చూపిస్తారు

చివరి మాట
-మంచి నాయకుడు పని ద్వారా నమ్మకం తెస్తాడు
-చెడ్డ నాయకుడు మాటలతో మాయ చేస్తాడు
ఈ కథలో రాజేంద్రుడు చెప్పే మెసేజ్ ఇదే..!
“ప్రజలు ఆలోచిస్తే మంచి నాయకులు వస్తారు, ఆలోచించకపోతే మాయగాళ్ళు వస్తారు.”

తేరాల రాజేంద్రప్రసాద్ గుప్తాలి
మీసేవ BJR నగర్,
హైదరాబాద్ 500037

# మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌ల పంపిణీ

- 47 మంది విద్యార్థులకు రూ.3.80 లక్షల ఆర్థిక సాయం
- సీఎస్ఆర్ కార్యక్రమాలకు రూ.200 కోట్ల కేటాయింపు
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే కూన రవికుమార్
- బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం




**నవతరం-శ్రీకాకుళం**

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ 2026-27 సంవత్సరానికి గాను రూ.200 కోట్లను కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలకు కేటాయించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సీఎస్ఆర్‌లో భాగంగా స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై, 47 మంది విద్యార్థులకు మొత్తం రూ.3,80,000ను స్కాలర్‌షిప్ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని, సమాజానికి సేవ చేయాలని సూచించారు.

మలబార్ గోల్డ్ ప్రతినిధులు మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 33 వేలమంది బాలికలకు స్కాలర్‌షిప్‌లను అందించేందుకు రూ.30 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ మేనేజర్ వస్సీ, మార్కెటింగ్ మేనేజర్ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం





- వరల్డ్ హెల్త్ డే సందర్భంగా వైద్య సేవలు
- సుమారు 100 మంది రోగులకు పరీక్షలు, మందుల పంపిణీ
- గ్రామ, పట్టణ స్థాయిలో పీఎంపీ సేవలు ప్రశంసనీయం
- ఆలయ ప్రాంగణంలో శిబిరం నిర్వహణ

**నవతరం-శ్రీకాకుళం**

కమ్యూనిటీ పారామెడిక్స్ ఒ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) శ్రీకాకుళం జిల్లా ఆధ్వర్యంలో వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం పాత శ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా సమీపంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మంది రోగులకు షుగర్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆలయ కార్యదర్శి బెహరా నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామీణ, పట్టణ స్థాయిలో ఇంటింటికి వైద్య సేవలు అందించడంలో పీఎంపీ సభ్యుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఆలయ ప్రాంగణంలో ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, ట్రెజరర్ కె. జనార్ధన్ రావులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమం అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, శిబిరానికి సహకరించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వండాన శిమ్మన్న, కార్యదర్శి నక్క లక్ష్మీనారాయణ, ట్రెజరర్ కె. జనార్ధన్ రావు, సహాయ కార్యదర్శి చిన్నాల రాములు, ఈసీ సభ్యుడు జి. గిరిబాబు, పీఎంపీ సీనియర్ సభ్యులు డి. వాసు, ఎం. లవడు, ఆర్‌వీసీహెచ్ నాగేశ్వరరావు, ఆర్. తారకేశ్వరరావు, జి. రాము, ఎస్. రమణమూర్తి, బెహరా రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్‌పై హైకోర్టు తీర్పుకు స్వాగతం

- లక్షలాది తాత్కాలిక ఉద్యోగులకు న్యాయం చేయాలి
- సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్



**నవతరం-శ్రీకాకుళం**

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. తిరుపతి రావు స్వాగతించారు. క్రాంతి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా తాత్కాలిక ఉద్యోగులతో తక్కువ వేతనాలతో పని చేయించడం శ్రమ దోపిడీ అని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్, కంటింజెంట్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులను కూడా రెగ్యులర్ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టి. ముత్యాలరావు, కె. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాతలే నిజమైన హీరోలు

- అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం
- సుమారు పలువురు అభిమానుల నుంచి రక్త సేకరణ
- హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహణ




**నవతరం-శ్రీకాకుళం**

రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదాతలే నిజమైన హీరోలని అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను అన్నారు. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని శ్రీ కళ్యాణ మండపంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తైక్వాండో శ్రీను, సుధీర్ వర్మ, డా. కంఠ వేణు, వైశ్యరాజు మోహన్ ప్రారంభించారు. రక్తదానం చేసిన అభిమానులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. వేసవిలో రక్త నిల్వలు తగ్గే సమయంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి, 9 నుంచి 26 ఏళ్ల మధ్య బాలికలు, మహిళలు టీకా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నగర స్థాయి అభిమాన సంఘాల నాయకులు, మెగా ఫ్యామిలీ అభిమానులు పాల్గొన్నారు.

# జనసేన పాలనలో అభివృద్ధి వేగం: జానీ

- ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ సదుపాయాల కల్పన
- పాలకొండ నియోజకవర్గంలో గ్రామాలకు మౌలిక వసతులు



**నవతరం-శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్‌లో గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా పంచాయతీ రాజ్ శాఖలో ఆశించిన అభివృద్ధి జరగలేదని, అయితే పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జానీ తెలిపారు. పాలకొండ నియోజకవర్గంలో గతంలో ఎన్నో మంది ఎమ్మెల్యేలు గెలిచినా సాధించలేని అభివృద్ధిని ప్రస్తుత జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చేపట్టారని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి రహదారులు కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

గత 12 ఏళ్లుగా జనసేన పార్టీ బలోపేతానికి చేసిన కృషి ఫలిస్తున్నందుకు గర్వంగా ఉందని, ప్రస్తుతం మంచి ప్రభుత్వం కొనసాగుతోందని ఆయన అన్నారు.

# ఆరోగ్యానికి నడకే అస్త్రం

- వరల్డ్ హెల్త్ డే వేడుకలు ఘనంగా నిర్వహణ
- ప్రముఖ వైద్యులకు సత్కారం, వాకర్స్‌కు వైద్య పరీక్షలు




**నవతరం-శ్రీకాకుళం**

సంపూర్ణ ఆరోగ్యానికి నడక సంఘాలు మంచి వేదికలని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్, సావుకారి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యంపై అవగాహన పెంపొందించడం అత్యవసరమన్నారు. నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌తో ముందుకు వెళు_న్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ వైద్యులను సత్కరించారు. అలాగే సీనియర్ వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పోలినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, నగర ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**